క్లుప్తంగా

విద్యార్థినికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న మాజీ కౌన్సిలర్ గణేష్ ముదిరాజ్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన దండు మహేందర్, అనిత కూతురు దండు హారిక ఆదివారం విడుదల చేసిన ఎప్‌సెట్ ఫలితాల్లో 1,222 ర్యాంక్ సాధించింది. విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్ దండు గణేష్ ముదిరాజ్ సోమవారం శాలువాతో విద్యార్థిని సన్మానించి స్వీట్లు తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించి ఉజ్వల భవిష్యత్ పొందాలని ఆకాంక్షించారు. విద్యార్థినులను పోత్సహిస్తున్న తల్లిదండ్రులను సైతం అభినందించారు.

ఘనంగా బీరప్ప జాతర



బీరప్ప జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి, నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని కొలన్‌గూడలో బీరప్ప జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద కురుమ బండ శ్రీనివాస్, సెల్వోజీ రాచూరి కరణ్ ఆధ్వర్యంలో పూజారులు బీరప్ప, కామరాతిదేవి కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కాగా స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, క్యామ మల్లేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్ తదితరులు హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆదర్ల గీతేశ్వరిగణేశ్, నాయకులు బీరప్ప, వెంకటేశ్, గణేష్, రాజు, వేణు తదితరులు పాల్గొన్నారు.

యూ రూల్ ఆన్‌లైన్ సెంటర్ ప్రారంభం



ఆన్‌లైన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఏసీపీ కృష్ణయ్య

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన యూ రూల్ (ఒక పరిష్కారం) సంస్థ మొదటి కార్యాలయాన్ని సోమవారం ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య ప్రారంభించారు. నిరుద్యోగ యువకులు కలిసి ప్రారంభించిన ఈ సెంటర్‌ను ప్రజలు ఆదరించాలన్నారు. ఈ కేంద్రంలో అన్ని రకాల ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉంటాయని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నిర్వాహకులకు ఏసీపీ సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గోవర్ధన్, దుర్గాప్రసాద్, మహేందర్, వాణినరేశ్, సురేష్, బాబు, కేశవరావు, గీత, అరుణ పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం నుంచి అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకు గణాధిపతిపూజ, పుణ్యాహవానం, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ట, రుద్ర హావనం,దుర్గాసూక్తి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 9.14 లకు విగ్రహ ప్రతిష్ఠపన, అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

వనస్థలిపురం: ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం వనస్థలిపురం డివిజన్ శక్తినగర్ కాలనీలో మున్సిపల్ కార్మికులతో కలిసి సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య, అలివేలు, ఎల్లమ్మ, జయమ్మ, యాదమ్మ, వెంకాయమ్మ, అనిత, నర్సింహా, జగదీష్, అనసూయ, పద్మ, లక్ష్మమ్మ, సులోచన, శోభ, సునీత, నాగమ్మ పాల్గొన్నారు.

ఆగని అక్రమ దందా!

- అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు
- రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా తరలింపు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు



నాగిరెడ్డిపల్లిలో టీజీఐఐసీకి కేటాయించిన భూమిల్లో మట్టి తవ్వకాలు చేపట్టడంతో ఏర్పడిన గుంతలు

మహేశ్వరం: మహేశ్వరం మండలంలో అక్రమ మట్టి దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, చెరువులు, కుంటల్లో వ్యాపారులు ఇష్టానుసారంగా మట్టి తవ్వేస్తూ రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇటుక బట్టీలు, ఇళ్ల నిర్మాణాలకు విక్రయిస్తున్నారు. మట్టి తవ్వకాల తంతు బహిరంగంగానే జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి, తుమ్మలూరు, రావిర్యాల, దుబ్బచర్ల, గంగారం, ఆకన్‌పల్లి, కొత్తతండా, సిరిగిరిపురం గ్రామాల్లో అసైన్డ్, చెరువు శిఖం, ప్రభుత్వ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళల్లో జేసీబీలు, ఇటాచీలతో తవ్వేసి టిప్పర్లలో నింపి తరలిస్తున్నారు. టిప్పర్లలో అధిక లోడు మట్టిని తరలిస్తున్న క్రమంలో గ్రామాలు, తండాల్లో ఇటీవల నిర్మాణం చేసిన బీటీ, సిమెంట్ రోడ్లు పాడవుతున్నాయి. దుమ్ము, దూళీ ఇళ్లపైన పడడంతో పాటు రాత్రి వేళల్లో పెద్దగా వాహనాల శబ్దం రావడంతో ప్రజలకు ఇబ్బందికరంగా మారుతోంది.

టిప్పర్లలో తరలింపు

మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో టీజీఐఐసీ అధికారులు ఐటీ పార్కు ఏర్పాటు కోసం సుమారు 200 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమి సేకరించింది. ఇటీవల టీజీఐఐసీ ఐటీ పార్కు ఏర్పాటు చేస్తున్నామని నోటిఫికేషన్ జారీ చేసింది. టీజీఐఐసీకి కేటాయించిన అసైన్డ్ భూముల్లో మట్టి మాఫీయా రాత్రి వేళల్లో అక్రమంగా ఇటాచీ, జేసీబీలతో తవ్వకాలు చేపట్టి టిప్పర్లలో తరలిస్తున్నారు. రైతులు కూడా మా భూమి ఎలాగో టీజీఐఐసీ తీసుకుంటుంది ఆ భూమిలో మట్టిని తవ్వేసి అమ్ముకుంటే డబ్బులు వస్తాయి. ప్రభుత్వం టీజీఐఐసీ వారు ఎకరానికి నష్టపరిహారం ఇస్తారనే దురాశతో మట్టి వ్యాపారులతో చేతులు కలిసి మట్టిని తవ్వేసి విక్రయించుకుంటున్నారు.

రూ.4 వేల నుంచి 7వేల వరకు విక్రయాలు

మట్టి మాఫీయాకు కొందరు నేతల సహకారం ఉందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. రోజు రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామువరకు జేసీబీ, ఇటాచీలతో మట్టిని తోడేసి టిప్పర్లలో తరలిస్తున్నారు. ఒక టిప్పర్‌కు రూ.4 వేల నుంచి రూ.7 వేల వరకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. మట్టి తరలింపుపై ఎవరైనా ప్రశ్నిస్తే ముడుపులు ఇచ్చి మచ్చిక చేసుకొని నోర్లు మూయిస్తున్నారు. ఇంకా ఎవరైనా గట్టిగా ప్రశిస్తే వారిపై దాడులకు కూడా వెనుకాడడం లేదు. మట్టి దందా ఆయా గ్రామ మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నేతలకు వరంగా మారింది. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు వస్తే, పండుగల సమయంలో, శని, ఆదివారాల్లో మట్టి దందాను జోరుగా సాగిస్తున్నారు. కళ్ల ముందే మట్టి రవాణా జరుగుతున్నా అధికారులు, పోలీసులు చోద్యం చూస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

“ కేసులు నమోదు చేస్తాం



ఎవరైనా ప్రభుత్వ, అసైన్డ్, శిఖం భూముల్లో అక్రమంగా తవ్వకాలు చేపడితే రైతు భూమిని పీఓటీ కింద తీసుకొని మట్టిని తరలిస్తున్న జేసీబీలు, టిప్పర్లను సీజ్ చేస్తాం. క్రిమినల్ కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించి చర్యలు తీసుకుంటాం. ఇదివరకు మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లు, జేసీబీలను పట్టుకొని వ్యాపారులపై కేసులు నమోదు చేశాం. మట్టి తవ్వకాలు చేపట్టడానికి ఎవరికి అనుమతులు ఇవ్వలేదు. పోలీసుల సహకారంతో రాత్రి వేళల్లో గట్టి నిఘా ఏర్పాటు చేస్తాం. మట్టి వ్యాపారాన్ని ప్రోత్సహించిన, తవ్వకాలు చేపట్టిన ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు.

–సైదులు, తహసీల్దార్, మహేశ్వరం

సుందరీకరణ పేరుతో అవినీతి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి



అల్మాస్‌గూడలో కోమటికుంట చెరువును పరిశీలిస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: సుందరీకరణ పేరుతో గుత్తేదారులు అవినీతికి పాల్పడి పనులు అర్ధంతరంగా నిలిపివేశారని 24వ డివిజన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి ఆరోపించారు. సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి నవారు మల్లారెడ్డి అల్మాస్‌గూడలోని కోమటికుంట చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్మాస్‌గూడలోని కోమటికుంట, పోచమ్మకుంట చెరువులను సుందరీకరణ చేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని చెప్పి, చెరువులకు కేటాయించిన కోట్ల నిధులు తప్పుదారి పట్టించారని ఆరోపించారు. 2023లో రూ.2.50 కోట్ల హెచ్‌ఎండీఏ నిధులు కేటాయిస్తూ కోమటికుంట చెరువుకు ఫౌండేషన్ స్టోన్ వేశారన్నారు. రెండు చెరువుల చుట్టూ భవన నిర్మాణ వ్యర్థాలతో కట్ట వేసి అర్ధంతరంగా పనులు నిలిపివేశారన్నారు. చెరువులను స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంతో చెరువుల చుట్టు పక్కన ఉన్న కాలనీల ప్రజలు మురుగునీటి వాసన, దోమల బెడదతో అల్లాడుతున్నారన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం మొదలు పెట్టిన సుందరీకరణ పనులు ఇప్పటికీ పూర్తి చేయకపోవడం దారుణమన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ నేతల నిర్లక్ష్య వైఖరితోనే సుందరీకరణ పనులు, వాకింగ్ ట్రాక్ పనులు ఆగిపోయి నిధుల గోల్‌మాల్ జరిగిందని ఆరోపించారు. సుందరీకరణ పనులు చేపట్టిన గుత్తేదారు పత్తాలేకుండా పోయాడన్నారు. కాంట్రాక్టర్‌కు ఎన్ని బిల్లులు విడుదల చేశారన్న విషయాన్ని అధికారులు తెలపడం లేదన్నారు. సుందరీకరణ పనుల్లో అవినీతి జరిగిందని గతంలోనే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఇక బీఆర్‌ఎస్ నేతల పట్ల ప్రజలు నమ్మకం కోల్పోయారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తరపున బాధ్యత తీసుకొని నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్ సారథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి స్పెషల్ ఫండ్ తీసుకొచ్చి చెరువులను సుందరీకరిస్తామన్నారు. కార్యక్రమంలో దిండు శ్రీనివాస్‌గౌడ్, మల్గారి శ్రీధర్‌రెడ్డి, రామిడి శ్రీనివాస్ రెడ్డి, వంశీ, చంద్రం, లక్ష్మయ్య, సత్తిరెడ్డి, కొండయ్య, విద్యాసాగర్, సుదీర్ తదితరులున్నారు.

ఆపరేషన్ సిందూర్ సంఘీభావ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కాలనీవాసులు, నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్ గ్రీన్‌రిచ్ కాలనీవాసులు ఆదివారం రాత్రి ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు. భారత్, పాక్ మధ్య జరుగుతున్న యుద్ధంలో వీరమరణం చెందిన జవాన్ మురళీనాయక్‌కు నివాళిగా క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. జాతీయ జెండాలతో జై భారత్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముష్కరులను అంతం చేసేవరకు యుద్ధాన్ని ఆపొద్దన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పి.సుదర్శన్‌రెడ్డి, నయనాచారి, గిరిముదిరాజ్, కాలనీవాసులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

ముందుచూపుతోనే ట్యాంకుల నిర్మాణం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



గుర్రంగూడలో మిషన్ భగీరథ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతోనే మిషన్ భగీరథ ట్యాంకుల నిర్మాణాలను చేపడితే రేవంత్ సర్కార్ తాగునీటి సరఫరా కూడా చేయలేని దుస్థితిలో ఉండటం దురదృష్టకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సోమవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో కేసీఆర్ హయాంలో మంజూరైన నిధులతో నిర్మితమైన మిషన్ భగీరథ ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను సబితారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాటి బీఆర్‌ఎస్ హయాంలో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు నిర్మించిన వాటర్ ట్యాంకుల నిర్మాణాలు పూర్తయినా కూడా ప్రారంభించకుండా నీటితో నింపకుండా వదిలివేయడం కాంగ్రెస్ పార్టీకే చెల్లిందని విమర్శించారు. ప్రజలకిచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చక నిధులు లేవని చేతులెత్తేస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చేవరకు ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మాజీ కౌన్సిలర్ గుర్రం సాయికిరణ్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు సమైక్య జ్యోతి, అశోక్, అధికారులు, పలు కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రధానిని కించపర్చేలా ఫొటో పెట్టాడంటూ ఫిర్యాదు



పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కందుకూరు: ప్రధాని మోదీని కించపర్చేలా సోషల్ మీడియాలో ఫొటో క్రియేట్ చేసి పెట్టిన వ్యక్తిపై బీజేపీ నాయకులు సోమవారం కందుకూరు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని గుమ్మడవెల్లితండాకు చెందిన గణేష్‌నాయక్ వాట్సాప్ స్టేటస్‌గా ట్రంప్ కాళ్ల మీద మోదీ పడుతున్న విధంగా ఫొటో క్రియేట్ చేసి పెట్టాడని, ఇదేమని ప్రశ్నిస్తే నా ఇష్టం అంటున్నాడని బీజేపీ నాయకులు ఈ సందర్భంగా వాపోయారు. అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, జిల్లా నాయకులు జిట్టా రాజేందర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఎస్.భూమిరెడ్డి, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం

ఎల్లమ్మ ఆలయ చైర్మన్ రత్నం



ఆలయ రోడ్డులో కంప చెట్లను తొలగించే పనులను పరిశీలిస్తున్న చైర్మన్ రత్నం

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కలిపిస్తామని ఆ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని సర్దార్‌నగర్ ఎల్లమ్మ కమాన్ నుంచి రావిర్యాల వరకు రోడ్డులో ఉన్న కంపచెట్లు, పిచ్చిమొక్కలను జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సింగల్ రోడ్డు మరమ్మతులకు గురై, కంప చెట్లు పెరిగి ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో దేవాదాయ ధర్మదాయ శాఖ నిధులతో కంప చెట్లను తొలగించామన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మోహన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ మీగడ కాశీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి ఆలయం సందర్శన



అరవింద సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని గడ్డిఅన్నవర క్షేత్ర శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానాన్ని కంచి కామకోటి పీఠం ధర్మాధికారి అరవింద సుబ్రమ్మణ్యం సోమవారం సందర్శించారు. ఈ నెల 18న జరిగే ఆలయ ట్రస్ట్ ఎన్నికల గురించి ఆయనకు తెలిపారు. అలాగే ఈ నెల 25న ఆలయంలో జరిగే 108 వెండి కళశాలతో స్వామి వారికి జరిగే అభిషేకానికి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వక్కలంక శ్రీనివాసరావు, వసంత మనోహర్, ఎస్ఆర్ శ్రీనివాస్, బచ్చు సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి తిరు కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్



కల్యాణానికి హాజరైన భక్తులు

కందుకూరు: మండలంలోని ఊట్లపల్లి పరిధిలో గల శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ధర్మకర్త తేరటి లక్ష్మణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో వేద పండితుడు రేవెళ్ల రాజుశర్మ సమక్షంలో బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి, అమ్మవార్ల తిరు కల్యాణమహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అంతకు ముందు సర్వదేవతలకు అభిషేకాలు, సుదర్శన, రుద్ర, ఆంజనేయ హోమాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందించారు. కాగా కల్యాణోత్సవానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, సర్పంచ్‌ల సంఘం రాష్ట అధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డితో పాటు ఎంపీటీసీ మాజీ సభ్యుడు బక్క మల్లేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, వెంకటేశ్‌ముదిరాజ్ హాజరయ్యారు.

వీర జవాన్లకు ఘన నివాళి



జవాన్ల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

మన్సూరాబాద్: దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన వీర జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ సీపీఐ హయత్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎల్‌బీనగర్ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ రక్షణ, సార్వభౌమత్వ పరిరక్షణలో సైనికుల పాత్ర ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో వంశీవర్ధన్‌రెడ్డి, రమావత్ సక్రునాయక్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలి

మైలార్‌దేవ్‌పల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. సోమవారం మైలార్‌దేవ్‌పల్లి మెయిన్ గ్రామంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ... డివిజన్ మెయిన్ విలేజ్‌లోని ఉమ్మడి హనుమాన్ దేవాలయం వీధిలో ఎక్కడ చూసినా డ్రైనేజీ నీరు ఏరులై పారుతున్నాయన్నారు. జలమండలి అధికారులు చూసీచూడనట్లు గాలికి వదిలేస్తున్నారన్నారు. నల్లాల్లో తాగు నీరు రాక అలమటిస్తున్న ప్రజలకు కనీసం ట్యాంకర్ల ద్వారా మంచినీరు అందించాలన్న ఆలోచననే అధికారులకు లేదన్నారు. ప్రజా ప్రతినిధులు సైతం పట్టించుకోవడం లేదన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదలు ఎక్కువగా నివసించే మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని సమస్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు ఎస్.రాముయాదవ్, యూత్ అధ్యక్షుడు అక్కం రఘు, మైసిరెడ్డి, రాజేష్‌యాదవ్, అరుణ్‌ముదిరాజ్, చిరంజీవి, కొంపల్లి జగదీష్, రాజు, ఆప్కో రాజు, భగవాన్‌దాస్, రాజు, ప్రవీణ్, వెంకటరమణ, అశోక్‌కుమార్, సరిత, అరుణారెడ్డి పాల్గొన్నారు.

మజిల్ స్ట్రోక్‌కు అరుదైన శస్త్రచికిత్స



రోగి తిరుపతితో వైద్య బృందం

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ చింతలకుంటలోని నాసా ఆసుపత్రిలో మజిల్ స్ట్రోక్‌కు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. సోమవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యూరాలజీ క్లినికల్ డైరెక్టర్ డా. నవీన్‌కుమార్ వేణిగళ్ల, క్రిటికల్‌కేర్, అనస్తీషియా విభాగాధిపతి డా. రాకేష్ శస్త్ర వివరాలు వెల్లడించారు. హయత్‌నగర్‌కు చెందిన పగిళ్ల తిరుపతి (32) ఫిజియోథెరపిస్టుగా పనిచేస్తున్నాడు. గత కొన్ని రోజులుగా కుడి పాదం బలహీనం కావడం, నడుంనొప్పి రావడంతో డిస్క్ సమస్య అనుకుని ఎంఆర్‌ఐ స్కానింగ్ చేసినా సమస్య తెలియకపోవడంతో నాసా ఆసుపత్రికి వచ్చాడు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్య బృందం గుండె నుంచి రక్తాన్ని సరఫరా చేసే అయోరా ధమని నుంచి కుడి కాలులోకి రక్తం సరఫరా ఆగిపోయినట్లు గుర్తించారు. పిక్క మొత్తం ఫేషియటమీ చికిత్స ద్వారా మోకాలు నుంచి పిక్క కింది వరకు మజిల్స్ ఓపెన్ చేసి ఎంబోలెక్టమి ద్వారా రక్తనాళాల్లోని గడ్డ కట్టిన రక్తాన్ని తొలగించారు. వేస్కులర్ సర్జన్ నేతృత్వంలో సిటీ యాంజియో చేసి రక్త సరఫరాను పునరుద్ధరించారు. తర్వాత దెబ్బతిన్న కండరాన్ని తొలగించి తొడభాగం నుంచి చర్మాన్ని తీసుకుని ఫ్లాప్ వేసి వ్యాక్యూమ్ అమర్చి స్కిన్ గ్రాఫ్టింగ్ చేశారు. 40 రోజుల తర్వాత తిరుపతి ఇప్పుడు ఆయన కాళ్ల మీద ఆయన నడవగలిగే స్థితిలో ఉన్నాడని వైద్యులు తెలిపారు.

పరిశ్రమల సహకారంతో నైపుణ్యాల వృద్ధికి కృషి



కార్యక్రమంలో పాల్గొన్న నాస్‌కామ్ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు

శంషాబాద్ రూరల్: మండలంలోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నాస్‌కామ్ ఆధ్వర్యంలో అనుభవాత్మక ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. పాఠ్యాంశంలో కలిపే అంశాలతో పాటు సహకార నమూనాలు, పట్టభద్రుల నైపుణ్య లక్ష్యాలకు అనుసంధానం, అమలుకు తగిన వ్యూహాల వాటిపై చర్చించారు. నాస్‌కామ్‌తో కళాశాల చేసుకున్న ఎంఓయూలో భాగంగా విద్యార్థులకు పరిశ్రమ అనుభవం, ఉపాధికి అనుగుణమైన నైపుణ్యాలు అందించడానికి దోహదపడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.ఆర్.రవీంద్ర అన్నారు. పరిశ్రమల సహకారంతో నైపుణ్యాల అభివృద్ధికి ఇది ఒక మార్గదర్శక మోడల్‌గా నిలిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్ఈపీ 2020 అనుగుణంగా క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్‌లను పాఠ్యాంశంలో సమగ్రంగా ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాస్‌కామ్ ప్రతినిధులు షీబా థామస్, కమ్రాన్ అష్రఫ్, సీనియర్ కన్సల్టెంట్, కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపిటెన్సీస్ వై.రామ్మోహన్‌రావు, కళాశాల కంప్యూటర్ సైన్స్ డీన్ డాక్టర్ జి.వేంకటరామిరెడ్డి, పరిశోధన డీన్ డాక్టర్ జె.కృష్ణచైతన్య, విద్యా వ్యవహారాల డీన్ డాక్టర్ ఎస్.రాజేందర్, మూక్స్ అండ్ ఐఐఐసీ ఇంచార్జి డాక్టర్ ఎస్.వి.వసంత, ఎంఓసీఎస్ హెడ్ డాక్టర్ డి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో చీడపీడల నివారణ

- నేల ఆరోగ్య యాజమాన్య సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పవన్‌చంద్రారెడ్డి

శంషాబాద్ రూరల్: వేసవి దుక్కులతో పంటలకు ఆశించే చీడపీడల నివారించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నేల ఆరోగ్య యాజమాన్య సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.పవన్‌చంద్రారెడ్డి సూచించారు. పెద్దగోల్కొండలో సోమవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు వాతావరణ ఆధారిత సలహాలు, సూచనలు పాటించి సాగు చేసుకుంటే నష్టాలు రాకుండా చూసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలకు తగు మోతాదులోనే ఎరువులు వాడాలని సూచించారు. పంట మార్పిడి, సేంద్రియ ఎరువులతో పెట్టుబడి తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ జి.వినయ్ మాట్లాడుతూ... రైతులు సమగ్ర వ్యవసాయ విధానాన్ని అవలంబిస్తూ ఎరువుల వాడకాన్ని తగ్గించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పశువుల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల పశువైద్యాధికారి డాక్టర్ జి.శేఖర్ వివరించారు. ఇందుకు సంబంధించి రూపొందించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నార్సింగ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరక్టర్ ఎ.శ్రీకాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, సొసైటీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, రైతులు భాస్కర్‌గౌడ్, భోజిరెడ్డి, పాండురంగారెడ్డి, నర్సింహారెడ్డి, ఏఈఓ రాఘవేందర్‌గౌడ్, వ్యవసాయ కళాశాల పరిశోధన విద్యార్థిని వి.వర్షిత తదితరులు పాల్గొన్నారు.